## మహిళపై కత్తితో దాడి

**అత్యాచారం కేసు నమోదు**



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లి మండలం, దిగువపల్లి గ్రామపంచాయతీ, బోయకొండ యానాదిపాలెంలో దారుణం చోటుచేసుకుంది. తమ్ముడు వేట కొడవలితో అక్కపై దాడి చేయడంతో గంగులమ్మ పరిస్థితి విషమంగా మారింది. ఈ దాడిలో ఆమె ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి, ఎడమ చేతి. బొటనవేలు తెగిపోయింది. బాధితురాలిని చికిత్స నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై నాగేశ్వరరావు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో లక్ష కుంకుమార్చన




**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో 1కుమార్చన సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు .శక్తి స్వరూపిణి అయినటువంటి బోయకొండ గంగమ్మ ఆలయంలో వేద పండితులు అర్చకుల ఆధ్వర్యంలో విషెస్ అభిషేకము అలంకరణ గావించారు .అనంతరం డాలమెంటరీ హాలులో ఉత్సవ విగ్రహం ముందు 122 మంది దంపతులచే వేద పండితులు లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు, తొలి రోజున అమ్మవారి ఆలయంలో విశేష రీతిలో పుష్పాలంకరణ నిర్వహించారు, ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం అధికార సిబ్బంది భక్తులకు సేవలు అందించారు

## సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం



**నేటి సాక్షి నారాయణపేట(రిపోర్టర్ ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం సీఎం కప్పు క్రీడా పోటీలను నారాయణపేట జిల్లా డివైఎస్ఓ వెంకటేష్ శెట్టి ఆధ్వర్యంలో ప్రారంభించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు అధికారులు పాల్గొన్నారు.


## లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా తిరుపతి

**మల్లాపూర్‌లో ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం**



**నేటి సాక్షి మెట్‌పల్లి మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలోని ఖవీ= గార్డెన్‌లో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసే లక్ష్యంతో ఈ నూతన కమిటీని ఎంపిక చేశారు.అధ్యక్షుడు: రేవెల్లి తిరుపతి (ముత్యంపేట) సెక్రటరీ: పుంద్ర శశికాంత్ (నడికుడ) కోశాధికారి మిల్క నవీన్ (సిరిపూర్) కరీంనగర్ రీజియన్ గవర్నర్ సింహరాజు కోదండరాం సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, సమాజ సేవలో లైన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని, నూతన బాధ్యులు ఉత్సాహంతో పనిచేసి క్లబ్ పేరు ప్రతిష్టలను పెంపొందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మోర భద్రేశం, గుంటుక చంద్ర ప్రకాష్, వెలుముల శ్రీనివాసరావు మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి



**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ ప్రక్రియను బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి బి. సత్యప్రసాద్ జనరల్ అబ్జర్వర్ ఖర్టాడే కాళీచరణ్ సుదామా రావు సమక్షంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఎన్నికల విధానం ఎలాంటి

- **పోలింగ్ సిబ్బంది రెండవ రాండమైజేషన్ పూర్తి**

వివాదాలకు తావు లేకుండా సాగాలనే ఉద్దేశంతో ఈ రాండమైజేషన్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.

**పకడ్బందీ ఏర్పాట్లు - అధికారుల సమన్వయం**

రాబోయే మున్సిపల్ ఎన్నికలను ఎలాంటి లోపాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేస్తూ, పోలింగ్ సిబ్బంది కేటాయింపులో నిష్పక్షపాతత్వాన్ని పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్, జిల్లా నోడల్ అధికారి కె. రాము, కలెక్టరేట్ ఏవో హకిమ్, ఈడిఏం మమతతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌లో మైనర్ బాలికకు వేధింపులు..

- **మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు...**

**నేటిసాక్షి చందుర్తి (సతీష్):** చందుర్తి మండలంలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా మైనర్ బాలికకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ, ఫొటోలు షేర్ చేసి ప్రేమించాలని ఒత్తిడి చేస్తూ బెదిరింపులకు పాల్పడిన మైనర్ బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల ప్రకారం మైనర్ బాలుడు తన ఇన్‌స్టాగ్రామ్ ఐడీ నుంచి మైనర్ బాలిక ఐడీకి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడంతో పాటు, ప్రేమను అంగీకరించకపోతే ఆమె గురించి తల్లిదండ్రులకు అనుచితంగా చెబుతానని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనపై మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం మైనర్ బాలుడిని ఈ రోజు జువెనైల్ బోర్డు ఎదుట సత్ప్రవర్తన కోసం హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అసభ్యకరమైన సందేశాలు పంపుతూ బాలికలు, మహిళలను వేధించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.




# ప్రజ్ఞాపూర్‌లో నూతన బస్టాండ్ ప్రారంభం






- **స్టార్ హెల్త్ లయన్స్ క్లబ్‌ల ఉమ్మడి సేవా కార్యక్రమం**

**నేటిసాక్షి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ :** సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లోని జగదేవపూర్ చౌరస్తా వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం పునర్నిర్మించిన బస్టాండ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. స్టార్ హెల్త్ ప్రతినిధి గుడాల రాధాకృష్ణ మరియు వారి మిత్రబృందం 'బావాస్ బ్యాచ్' ఆర్థిక సౌజన్యంతో ఈ బస్టాండ్ నిర్మించబడింది. లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ మహతి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాయి. స్టార్ హెల్త్ బిజినెస్ హెడ్ కె. బాలాజీ శ్రీనివాస్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అమర్నాథ్ రావు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ పవన్ కలిసి రిబ్బన్ కట్ చేసి బస్టాండ్‌ను ప్రారంభించారు. "ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించి బస్టాండ్ పునర్నిర్మించడం గొప్ప విషయం. సమాజంలో ప్రతి ఒక్కరిలో ఇలాంటి సేవా భావం పెంపొందాలి." – పవన్, డిపో మేనేజర్ "మానవసేవే మాధవసేవ అనే నినాదంతో లయన్స్ క్లబ్ ముందుకు సాగుతోంది. రాధాకృష్ణ బృందం సహకారంతో ఈ ప్రాజెక్ట్ పూర్తి కావడం శుభపరిణామం." – అమర్నాథ్ రావు, లయన్స్ క్లబ్ గవర్నర్ ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు సంజయ్ గుప్తా, ఉప్పల మెట్టయ్య, సత్యనారాయణ, డాక్టర్ కుమారస్వామి, నేతి శ్రీనివాస్, మల్లేశం గౌడ్, డాక్టర్ శైలజ, సుజాత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి




**నేటి సాక్షి మిర్యాలగూడ :** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా నలుమూలల నుండి పార్టీ కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు మరియు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.

# ప్రతి విద్యార్థి చదివేలా ప్రోత్సహించండి

- పెసర ప్రభాకర్ రెడ్డి
- తిరుమలాయపాలెం మండలంలోని పాఠశాలల్లో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పర్యటన



**నేటి సాక్షి తిరుమలాయపాలెం (రుద్రరాజు మెట్టు):** విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (DAMO) పెసర ప్రభాకర్ రెడ్డి మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల చదువు తీరును మరియు ఉపాధ్యాయుల బోధనా పద్ధతులను పరిశీలించారు. తనిఖీ చేసిన పాఠశాలలు: బచ్చోడు, జూపెడ, పైనంపల్లి, కాకరవాయి (ఉన్నత మరియు ప్రాథమిక పాఠశాలలు), సోలిపురం ప్రాథమికోన్నత పాఠశాల మరియు మంగ్యా తండా ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 'ఎవరీ చైల్డ్ రీడ్స్' (ECR) కార్యక్రమం తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ నెలలో జరగనున్న ఫౌండేషనల్ లెర్నింగ్ స్టడీ (FLS) అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉన్నత పాఠశాలల్లో లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం (LIP) మరియు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను (FLN) పరిశీలించారు. ఉపాధ్యాయులకు తరగతి గదిలో బోధన నాణ్యంగా ఉండాలని, ప్రతి విద్యార్థి స్పష్టంగా చదివేలా ప్రోత్సహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అభ్యసన సామర్థ్యాలను పెంచడానికి వివిధ కృత్యాలను (Activities) నిర్వహించాలని కోరారు. ఈ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి (MEO) శ్రీనివాసరావు, ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# సోషల్ మీడియాపై పోలీసుల ప్రత్యేక నిఘా

- అసభ్య పోస్టులు పెడితే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐ.పి.ఎస్



**నేటి సాక్షి ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ :** ఆసిఫాబాద్ కాగజ్‌నగర్ పట్టణాల్లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ నితిక పంత్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇతరులను అవహేళన చేయడం, వ్యక్తిగత దూషణలు చేయడం లేదా అసభ్య పదజాలం వాడటం నేరం. కులమతాల మధ్య చిచ్చు పెట్టేలా ప్రవర్తించినా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసే వీడియోలు లేదా ఫోటోలు పోస్ట్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే విధంగా తప్పుడు వార్తలు, వదంతులు (=బఎశీతీం) వ్యాప్తి చేయకూడదు. దీనివల్ల శాంతి భద్రతలకు భంగం కలిగితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తాం. అభ్యంతరకర పోస్టులు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ఫిర్యాదుల కోసం సంప్రదించండి: సోషల్ మీడియా వేధింపులు లేదా తప్పుడు ప్రచారాలపై సమాచారం ఇచ్చేందుకు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్‌ను ఈ నంబర్లలో సంప్రదించవచ్చు: 8712670505 లేదా 551 ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఎన్నికలు పారదర్శకంగా మరియు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# నా ఆరాటం, పోరాటం జగిత్యాల అభివృద్ధి కోసమే

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- యావర్ రోడ్డు వెడల్పుకు కట్టుబడి ఉన్నా.. ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు





**నేటి సాక్షి జగిత్యాల:** జగిత్యాల నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ఏకైక లక్ష్యమని, దీని కోసం ప్రభుత్వం తో కలిసి పనిచేస్తున్నానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. బుధవారం జగిత్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రగతిపై తన కార్యాచరణను వివరించారు. ముఖ్యమంత్రి చొరవతో జగిత్యాల పట్టణానికి 62.5 కోట్ల UIDF నిధులు తీసుకువచ్చామని, అలాగే 235 కోట్లతో నూతన ఆసుపత్రిని మంజూరు చేయించుకున్నామని తెలిపారు. మెడికల్ కాలేజీ పనుల కోసం పెండింగ్‌లో ఉన్న 41 కోట్ల బకాయిలను మంజూరు చేయించామని, దీనివల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన పనులకు సంబంధించి ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లకు రావాల్సిన బకాయిలను చెల్లించేలా చొరవ తీసుకున్నట్లు వెల్లడించారు. జగిత్యాల పట్టణ భవిష్యత్తు కోసం యావర్ రోడ్డు విస్తరణ అత్యంత అవసరమని, దీనిని 100 ఫీట్ల రోడ్డుగా వెడల్పు చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్వయంగా హామీ ఇచ్చారని, పట్టణ ప్రగతికి అడ్డుపడే వారు కోర్టు కేసులతో అడ్డంకులు సృష్టించడం సరికాదని హితవు పలికారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూనే కేవలం అభివృద్ధి కోసం ప్రభుత్వం తో కలిసి పనిచేస్తున్నానని ఆయన వివరించారు. "నిధుల కోసం ముఖ్యమంత్రిని కలిస్తే తన ఇల్లు, ఆసుపత్రిపై దాడులు చేయడం దారుణమని" ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీల కంటే జగిత్యాల ప్రజల సంక్షేమమే తనకు ముఖ్యమని, మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధికి సహకరించే అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని ప్రకటించారు. తనపై బురదజల్లే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, తనను గెలిపించిన ప్రజలకు అభివృద్ధి పనుల ద్వారానే రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పునరుద్ఘాటించారు.

# వివక్ష లేని సమాజాన్ని నిర్మించడంలో భాగస్వాములు కావాలి.

- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్




**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కలెక్టరేటులోని సమావేశలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ సామాజికపరంగా, వివక్షతో కూడిన సమాజంలో మార్పు రావాలన్న సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 4వ తేదీన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ సమానత్వం, న్యాయం, గౌరవం కోసం నిలబడాలని, ఏ రూపంలోనైనా అన్యాయని ఎప్పుడూ సమర్థించవద్దని కలెక్టర్ సూచించారు. భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నో విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని, రాజ్యాంగ సూత్రాలను సమర్థిస్తూ న్యాయమైన, సామరస్య పూర్వకమైన, సాధికారత కలిగిన తెలంగాణ భారతదేశ కోసం కృషి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్, జిల్లా అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డిఆర్ఓ మంగీలాల్, ఆర్డీఓ వాసు చంద్ర, డిబిసిడిఓ మాధవ రెడ్డి లతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ ఫ్లాగ్ మార్చ్



**నేటి సాక్షి వికారాబాద్ :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు పోలీసులు వికారాబాద్ పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా చూడటమే ఈ కవాతు ముఖ్య ఉద్దేశం. పట్టణంలోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిర్వహించిన ఈ మార్చ్‌లో డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ పాల్గొన్నారు. ప్రజలు భయం లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

## వాలీబాల్ విద్యార్థుల ఎంపిక





**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు మండలం పాలే అన్నారం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అశ్విని, మది మేఘన, నవదీప్ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 1న సూర్యాపేటలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరు, ఈ నెల 5 నుండి 8 వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను హెచ్.ఎం నర్సింహారెడ్డి, పీడీ సీతారాం రెడ్డి, సర్పంచ్ మండల జయమ్మ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు మరియు ఉపాధ్యాయులు అభినందించారు

## రోడ్డు ఎక్కిన రైతన్నలు



**నేటి సాక్షి చిలుకూరు :** చిలుకూరు ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా పంపిణీ చేయడానికి నిరసిస్తూ బుధవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరు బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆన్లైన్ బుకింగ్ యాప్ ద్వారా ప్రభుత్వం ఏరియా పంపిణీ చేయడం ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు చాలామంది రైతులు స్మార్ట్ ఫోన్లు లేవని యాప్ లకు డౌన్లోడ్ చేయడం రాక ఏరియా లభించే లభించ పోవడంతో సామాన్య రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే గతంలో మాదిరిగానే యూరియా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు అనంతరం ఏరియా పంపిణీ యాప్ ను తొలగించాలని కోరుతూ వ్యవసాయ అధికారులు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల పార్టీ సహాయ కార్యదర్శి సాహెబ్ అలీ గ్రామ శాఖ కార్యదర్శి చిలువేరు ఆంజనేయులు పార్టీ జిల్లా మండల నాయకులు కస్తూరి సైదులు దొడ్డ వెంకటయ్య పిల్లుట్ల కనకయ్య పిల్లిట్ల కృష్ణయ్య దొడ్డ నాగేశ్వరావు మండవాళ్లపైన రవి బొడ్డు కాశయ్య అంకుల్ లక్ష్మయ్య కాశయ్య రాంబాబు సత్యం మౌలానా వీరస్వామి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు...

## కోర్టుకి స్థలం కేటాయింపు.



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కోర్టు నూతనంగా నిర్మించబోయే బిల్డింగ్ కొరకై మేకల గండి స్థలం కొరకై (ల్యాండ్ అలాట్మెంట్) బార్ అసోసియేషన్ తీర్మానం కాపీని బుధవారం వికారాబాద్ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నూలి బసవరాజ్ పాటిల్ గారి ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా యూనిట్ పోర్ట్ఫోలియో జడ్జి శ్రీ నామవరపు రాజేశ్వరరావు గారికి తీర్మానం కాపీని సబ్మిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు జీపీ పరిశ్రమల విభాగం ఆకుల అనంతసేన్ రెడ్డి, జిల్లా జిపి కె శ్రీనివాస్ రావు, భారసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పోలీస్ వెంకట్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు కమల్ రెడ్డి చౌదరి యాదవ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ పిల్లికండ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## మైలారంలో ఉపాధి పనులు

**ప్రారంభించిన సర్పంచ్ గాలిపల్లి పోచవ్వ**

**నేటి సాక్షి, గన్నేరువరం,( బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం లోని మైలారం గ్రామంలో బుధవారం రోజున ఉపాధి హామీ పనులు గ్రామ సర్పంచ్ గాలిపల్లి పోచవ్వ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్యంగా గ్రామీణ ప్రాంతంలో ఉపాధి కల్పన ధ్యేయంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం (వి.బి.జి.రామ్.జి)లో 100 రోజులుగా ఉన్న పని దినాలను 125 రోజులకు పెంచి చట్టభద్ధమైన వేతన ఉపాధి లభించేలా చేయటం జరిగింది, అందుకు నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలిపారు.

## కనకదుర్గమ్మ జాతర



**చిలుకూరు (నేటి సాక్షి):** చిలుకూరు మండలం జెర్రిపోతుల గూడెంలో కనకదుర్గమ్మ జాతర (బండ్ల పండుగ) గురు, శుక్రవారాల్లో వైభవంగా జరగనుంది. గురువారం రైతులు ప్రభ బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయనుండగా, శుక్రవారం అమ్మవారికి మొక్కులు చెల్లించి వనభోజనాలకు వెళ్తారు. జాతర సందర్భంగా కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఎస్సై హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

## పనులను వేగవంతం చేయాలి

**కలెక్టర్ కుమార్ దీపక్**



**నేటి సాక్షి బెల్లంపల్లి:** బెల్లంపల్లిలో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు 200 కోట్ల రూపాయల వ్యయంతో ఈ పాఠశాలను నిర్మిస్తోందని ఆయన తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటిస్తూ, త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చలో పోతిరెడ్డిపాడు



**నేటి సాక్షి పాములపాడు :** రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సాధన కోసం గురువారం నిర్వహించనున్న 'చలో పోతిరెడ్డిపాడు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్సీపీ ఆర్టీఐ మండల అధ్యక్షుడు ఎస్. శివలింగం పిలుపునిచ్చారు. రాయలసీమ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకమని, ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, సమన్వయకర్త ధారా సుధీర్ పాల్గొంటారని తెలిపారు. పార్టీ కార్యకర్తలు, రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

## గ్రామాభివృద్ధికి సహకరించాలి

**సర్పంచ్ మారం సునీత**



**నేటి సాక్షి ఎండపల్లి :** మండల కేంద్రంలో నూతన పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో బుధవారం మొదటి గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మారం సునీత–జలేందర్ రెడ్డి మాట్లాడుతూ.. త్రాగునీరు, పారిశుధ్యం, రహదారుల వంటి సమస్యల పరిష్కారానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని కోరారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతూ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో సర్పంచ్ ఫోన్లో మాట్లాడారు. అలాగే అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హరికృష్ణ, ఉపసర్పంచ్ కళ్యాణి, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకై స్టడీ మెటీరియల్

- **డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి**




**నేటి సాక్షి - జగిత్యాల (పూరెళ్ల బాపు):** ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్నా విద్యార్థిని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి మా ట్రస్ట్ అందేజేస్తున్న స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగపడుతుందని డీఎన్ఆర్ ఏడ్యూకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాపరెడ్డి అన్నారు. జగిత్యాల పట్టణంలోని పిఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు) లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థినుల విద్యాభివృద్ధి, ఉత్తీర్ణత సాధన లక్ష్యంగా డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో డీఎన్ఆర్విజయపథం ఎస్సీస్సి స్టడీ మెటీరియల్ను బుధవారం విద్యార్థినిలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ విలువైన విద్యా సామగ్రిని అందజేసిన డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ప్రతాప్ రెడ్డికి పాఠశాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలనే దృఢ సంకల్పంతో ట్రస్ట్ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని ఉపాధ్యాయులు అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన సీనియర్ ఉపాధ్యాయులు జయశ్రీ , రజిత, అబ్దుల్ రజాక్ , దేవయ్య , ఉమా రాణి , కమలాకర్ రెడ్డి , రాజేందర్ , ఎల్ కుమార్ , సత్యనారాయణ , పిడి రాధిక , మొహమ్మద్ అబ్దుల్ రజ్జాక్, పల్లె శ్రీనివాస రెడ్డి పాఠశాలలోని ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.

**ఈ సందర్భంగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ**

ఈ స్టడీ మెటీరియల్ ద్వారా విద్యార్థినులు విషయ పరిజ్ఞానం పెంపొందించుకొని, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, హైదరాబాద్ వారూ భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షిశీచారు.

# మున్సిపల్ ఎన్నికలు పారదర్శకంగా జరగాలి

- **ఎన్నికల పరిశీలకులు జి. రవి**
- **అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలి**



**నేటి సాక్షి వికారాబాద్:** మున్సిపల్ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, సామరస్య పూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులందరూ సహకరించాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు జి. రవి కోరారు. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ఎన్నికల నిబంధనలను వివరించారు. ర్యాలీలు, సభలు మరియు మైకుల వినియోగానికి అధికారుల నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ప్రార్థన స్థలాల్లో ప్రచారం చేయకూడదని, అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా ప్రసంగాలు చేయరాదని స్పష్టం చేశారు. పోలింగ్కు 48 గంటల ముందే ప్రచారాన్ని ముగించాలి. ఓటర్లు ఓటు వేయడానికి ఎన్నికల కమిషన్ నిర్దేశించిన 17 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని ఓటర్లకు వివరించాలని అభ్యర్థులకు సూచించారు. ఎన్నికలు ముగిసిన 45 రోజుల్లోపు అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించాలి. లేనిపక్షంలో గెలిచిన అభ్యర్థుల ఎన్నికను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదర్ షాకోట్లో భూ కబ్జా యత్నం

- **రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు**




**నేటి సాక్షి రాజేంద్రనగర్:** గండిపేట మండలం హైదర్ షాకోట్ పరిధిలోని సర్వే నంబర్ 18/4లో గల తమ భూమిని తప్పుడు పత్రాలతో కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితుడు బెల్లి రవికుమార్ యాదవ్ ఆరోపించారు. ఈ విషయమై ఆయన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రవికుమార్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 18/4లోని మొత్తం 39 ఎకరాల 24 గుంటల భూమిలో కొంత భాగాన్ని గతంలో మిలటరీ అవసరాల కోసం అప్పగించారు. మిగిలిన భూమిలో తమకు చెందిన 1 ఎకరం 36 గుంటల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించుకోగా, జంగారెడ్డి, పావని రెడ్డి అనే వ్యక్తులు సర్వే నంబర్ 15 పేరుతో తప్పుడు దస్త్రాలు సృష్టించి జేసీబీలతో గోడను కూల్చివేశారని పేర్కొన్నారు. తమ భూమికి సంబంధించి కోర్టు ఉత్తర్వులు, మిలటరీ మరియు రెవెన్యూ అధికారుల నుంచి పొందిన NOC (నిరభ్యంతర పత్రాలు) అన్నీ ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. దౌర్జన్యంగా భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని రవికుమార్ యాదవ్ పోలీసులను కోరారు.

# అన్ని వర్గాలకు సమాన అవకాశాలు అందాలి





- **సోషల్ జస్టిస్ డే వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకల్లో పాల్గొన్న ఆయన, సామాజిక న్యాయం ద్వారా సమానత్వం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.

**సామాజిక న్యాయ దినోత్సవ ప్రాధాన్యం**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం చేకూర్చేలా తెలంగాణ ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అదే ఉద్దేశంతో ఫిబ్రవరి 4ను సామాజిక న్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సామాజిక న్యాయం సమాజానికి బలమైన పునాది అని పేర్కొన్నారు.

**సమసమాజ స్థాపనకు సమిష్టి కృషి అవసరం**

సోషల్ జస్టిస్ డే సందర్భంగా వివిధ సామాజిక వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలుపరుస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మహనీయులు, పెద్దలు సూచించిన మార్గంలో సమసమాజ స్థాపనకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగపరంగా, చట్టపరంగా లభించే హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

**ప్రతిజ్ఞ - ప్రతిభకు ప్రోత్సాహం**

అనంతరం సోషల్ జస్టిస్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ అందరిచేత సామాజిక న్యాయ ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి వివిధ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రదర్శనలు, కళాజాత బృందం ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి హాజరైన వారిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్. లత, బి. రాజ గౌడ్, బీసీ వెల్ఫేర్ అధికారి జి. సునీత, మైనార్టీ అభివృద్ధి అధికారి చిత్రు, జిల్లా ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారి కె. రాజ్ కుమార్, జిల్లా విద్యాధికారి కె. రాము, వివిధ స్థాయిల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో హకీమ్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పటికీ నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే

- అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రిని కలిశా..
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో( రాధారపు నర్సయ్య ):** ఇప్పటికీ తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నానని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల మోతె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రిని కలిశానని, దానిని రాజకీయంగా వక్రీకరించడం సరికాదని పేర్కొన్నారు.

### కాంట్రాక్టర్ల బిల్లులు - అనవసర రాద్ధాంతం

గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమై పూర్తయిన పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల బిల్లులు అన్నింటినీ ఇప్పించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. బిల్లులు పొందిన వారిలో కొందరు తనకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పనిచేసిన వారూ ఉన్నారని చెప్పారు. సమీకృత మార్కెట్ ఖాళీగా ఉండటంతోనే ఒక కాంట్రాక్టర్ అక్కడ తన మెటీరియల్ నిల్వ చేసుకున్నాడని, ప్రతి గ్రామంలో కాంట్రాక్టర్లు ఏదో ఒకచోట మెటీరియల్ నిల్వ చేసుకోవడం సాధారణమేనని, దీనిపై పెద్ద రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు.

### రెసిడెన్షియల్ జోన్ అంశంలో ద్వంద్వ వైఖరి

మంచాల కృష్ణ పెట్రోల్ బంక్ అంశంలో అనవసరంగా తన పేరును లాగుతున్నారని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కాంతి భవన్ నుంచి నూర్ మసీదు వరకు రెసిడెన్షియల్ జోన్‌గా ఉందని, పాత బస్టాండ్ నుంచి మిషన్ కంపౌండ్ వరకు కూడా అదే జోన్ పరిధిలోనే ఉన్నప్పటికీ అక్కడ నిర్మించిన దుకాణ సముదాయాలు ఎవరి హయాంలో కట్టారని ప్రశ్నించారు. సీనియర్ నాయకులకు కేవలం ఒక పెట్రోల్ బంక్ మాత్రమే కనిపిస్తోందని, అయితే తనకు అన్ని అక్రమాలూ కనిపిస్తున్నాయని, అయినా అందరినీ ఇబ్బంది పెట్టలేనని వ్యాఖ్యానించారు.

### రోడ్డు విస్తరణ - మాస్టర్ ప్లాన్ పోరాటం

యావర్ రోడ్డు విస్తరణ కోసం 100 ఫీట్లకు అనుమతి తీసుకువచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మాస్టర్ ప్లాన్ విషయంలో ఎంత గొడవ జరిగిందో ప్రజలకు తెలుసునని గుర్తుచేశారు. ఇవన్నీ కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే చేసిన ప్రయత్నాలేనని స్పష్టం చేశారు.

### పార్టీ మార్పు ప్రచారం - దాడులు చేసినా మౌనం

తాను బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచానని, ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నానని ఎమ్మెల్యే మరోసారి స్పష్టం చేశారు. అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిసినంత మాత్రాన పార్టీ మారుతున్నట్టు స్థానిక బీఆర్ఎస్ నాయకులు తనపై దుష్ప్రచారం చేశారని, తన ఆసుపత్రి, ఇంటిపై దాడులు కూడా చేశారని ఆరోపించారు. అయినప్పటికీ తాను ఎప్పుడూ పార్టీ అధిష్టానాన్ని గానీ, స్థానిక నాయకులను గానీ విమర్శించలేదన్నారు.

### ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ.200 కోట్లు

నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇకపై కూడా ముఖ్యమంత్రిని కలుస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి, మంత్రులు అన్ని విధాలుగా సహకరిస్తున్నారని చెప్పారు. కోరుట్ల నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయించానని వెల్లడించారు. కోరుట్ల, సిరిసిల్ల, కరీంనగర్‌లలో ఎక్కడా ఇలాంటి ఇంటిగ్రేటెడ్ స్కూల్ లేదని అన్నారు.

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు పిలుపు

తనను విమర్శిస్తున్నారని తాను తిరిగి విమర్శించే వ్యక్తిని కాదని, ఎవరికీ భయపడనని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. అభివృద్ధి కోసమే ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, అందుకే రాబోయే స్థానిక మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌తో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, సమిండ్ల శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం



- ఎమ్మెల్యే గిత్త జయసూర్య

**నేటి సాక్షి పాములపాడు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నందికొట్కూరు ఎమ్మెల్యే శ్రీ గిత్త జయసూర్య అన్నారు. బుధవారం పాములపాడు మండల పరిధిలోని 14 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (CMRF) ద్వారా మంజూరైన రూ. 7,23,053 విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. తుమ్మలూరు, కృష్ణరావుపేట, మిట్టకందల, మద్దూరు, వేంపెంట, ఎర్ర గూడూరు, పాములపాడు, చెలిమిళ్ళ, ఇస్కాల గ్రామాలకు చెందిన 14 మందికి ఈ ఆర్థిక సహాయం అందింది. మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా చెక్కులను అందజేసి, ఆపద కాలంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేంపెంట సర్పంచ్ వై. మాణిక్యమ్మ, రిటైర్డ్ టీచర్ దానమయ్య, హరనాథ రెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, తిమ్మారెడ్డి, సహకార చైర్మన్ గోవిందు మరియు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్‌లో జ్యోతి హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్



**నేటి సాక్షి జగిత్యాల :** సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సర్ సి.వి. రామన్ యంగ్ జీనియస్ ఒలింపియాడ్' పరీక్షలో జగిత్యాల జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభను కనబరిచి రాష్ట్ర మరియు జిల్లా స్థాయిల్లో అగ్రస్థానంలో నిలిచారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో విజేతలు బహుమతులు అందుకున్నారు. టి. శ్రీ వర్షిత (4వ తరగతి): రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ మరియు రూ. 5000 నగదు బహుమతిని గెలుచుకుంది. షామియా కౌసర్ (3వ తరగతి): రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంక్, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి జ్ఞాపికతో పాటు రూ. 1000 నగదు బహుమతి పొందింది. నిఖిలేష్ (10వ తరగతి): రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్, జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించి జ్ఞాపిక మరియు రూ. 1000 నగదు బహుమతి అందుకున్నారు. ముఖ్య అతిథులు గంటా శ్రీనివాసరావు, హీరో శ్రీకాంత్, శివాజీ రాజా సుచిర్ ఇండియా ఎండి వై. కిరణ్ చేతుల మీదుగా విద్యార్థులు ఈ పురస్కారాలను స్వీకరించారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

# మునగాలలో యూరియా కష్టాలు

### యాప్ వ్యవస్థతో రైతులకు ఇబ్బందులు



**నేటి సాక్షి మునగాల పాముల రాఘవేందర్ :** మునగాల మండలంలో యూరియా అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తెచ్చిన యాప్ విధానంలో సర్వర్ సమస్యలు తలెత్తడంతో, ఎరువుల దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, స్టాక్ తక్కువగా ఉండటాన్ని సాకుగా చూపి కొందరు వ్యాపారులు యూరియాను రూ. 350 నుండి రూ. 400 వరకు అక్రమ ధరలకు అమ్ముతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి యూరియా సరఫరాను క్రమబద్ధీకరించాలని, నల్లబజారు విక్రయాలపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# శిల్ప ప్రదర్శనకు ఆహ్వానం



**నేటి సాక్షి జగిత్యాల టౌన్:** జగిత్యాల ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న 20 అడుగుల వేంకటేశ్వర స్వామి సైకత శిల్ప ప్రతిష్టారాధనకు రావాలని ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సంజయ్ కుమార్ను నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం ఆర్గనైజర్ వేముల ఉమారాణి ఎమ్మెల్యేను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 5 నుండి మార్చి 5 వరకు జరిగే ఈ ప్రదర్శన కోసం బీజేపీ నాయకులు కొండ్ర లక్ష్మణ్ దంపతులను కూడా ఆహ్వానించారు.

# మునగాలలో అన్నదానం

### షేక్ మహీరుద్దీన్ జ్ఞాపకార్థం సేవ



**నేటి సాక్షి మునగాల:** స్వర్గీయ షేక్ మహీరుద్దీన్ జ్ఞాపకార్థం మునగాలలోని ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మహీరుద్దీన్ కుటుంబ సభ్యులు ఆశ్రమవ్యాసులకు స్వయంగా భోజనం వడ్డించి తమ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు నాగిరెడ్డి జయమ్మ, కుటుంబ సభ్యులు షేక్ ఖాదర్, నాగుల్ మీరా, రఫీ తదితరులు పాల్గొని మహీరుద్దీన్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి పాములపాడు :** నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య పాములపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద సుమారు రూ. 5 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ (జవీ=ఖీ) చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా బుద్దానగర్ గ్రామానికి చెందిన వంశీ కృష్ణకు రూ. 1,12,000 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దూరు తిమ్మారెడ్డి, హరినాథ్ రెడ్డి మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీవో పై చర్యలు తీసుకోండి

**జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్**




**నేటి సాక్షి పాములపాడు :** ఆర్టీవో పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ లింగాల నాగరాజు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా లింగాల నాగరాజు టిప్పర్లను నిలిపి ఆయన మాట్లాడుతూ కొత్త మాడుగుల లింగాపురం మధ్యలో తోలుతున్న టిప్పర్లకు పరిధికి మించి 30 టన్నులకు పర్మిషన్ ఆర్టీవో ఎలా ఇచ్చాడో సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామీణ రోడ్లమీద 15 టన్నుల కంటే ఎక్కువ పర్మిషన్ ఇవ్వకూడదని కానీ ఆర్టీవో అధికారులు 30 టన్నులు తోలుతున్న టిప్పర్లను ఎందుకు వదిలేస్తున్నాడో అర్థం కావడం లేదని ఆయన అన్నారు. గతంలో పరిమితి కి మించి పర్మిషన్ ఇవ్వడం వల్ల చెలిమిళ్ల లింగాల రోడ్డు అదే మాదిరిగా కృష్ణారావుపేట ఆనందపురం రోడ్లు అస్తవ్యస్తంగా పాడైపోయాయిని ఇప్పుడు మళ్లీ పర్మిషన్ ఇచ్చి మరిన్ని రోడ్లు పాడు చేస్తున్నారన్నారు. గతంలో పాడుచేసిన రోడ్లనే గుత్తేదారు గానీ పర్మిషన్ ఇచ్చిన ఆర్టీవో అధికారులు గాని రోడ్లను బాగు చేసిన దాఖలాలు లేవని గ్రామీణ ప్రాంత ప్రజలు అస్తవ్యస్తంగా ఉన్న చింద్రమైన రోడ్లపై టూ వీలర్స్ ట్రాక్టర్లు మనుషులు నడవడానికి కూడా వీలు లేకుండా రోడ్లు పాడైపోయాయిని ఆ రోడ్లను గుత్తేదారు వేస్తాడా లేకపోతే పర్మిషన్ ఇచ్చినటువంటి ఆర్టీవో అధికారులు వేస్తారో వాళ్ళే తెలుసుకోవాలని ఆయన మండిపడ్డారు. ముడుపులు తీసుకొని పరిమితికి మించిన టిప్పర్లకు పర్మిషన్ ఇచ్చిన ఆర్టీవో అధికారులు బాగుంటారు రోడ్లు వేసిన గుత్తేదారు రోడ్లు వేసుకుని వెళ్లిపోతాడు వీరు చేసిన పొరపాట్లకు రోడ్డు వెంట ఉన్న గ్రామాల ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తూ ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని ఆయన అన్నారు. చెలిమీళ్ళ లింగాల రోడ్డు అదే మాదిరిగా మాడుగుల లింగాపురం రోడ్లు పై అలాగే కృష్ణారావుపేట ఆనందపురం రోడ్ల దుస్థితి పై పర్మిషన్ ఇచ్చిన ఆర్టీవో అధికారులపై ఖచ్చితంగా జిల్లా కలెక్టర్కు అదే మాదిరిగా లోకాయుక్త మానవ హక్కుల కమిషన్కు తీసుకెళ్లి సమస్య పరిష్కారం అయ్యేవరకు వదిలే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు

## బిఆర్ఎస్‌ను గెలిపించండి



**విద్యాసాగర్ రావు**

**నేటి సాక్షి జగిత్యాల :** జగిత్యాల జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు పిలుపునిచ్చారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ స్థానాల్లోనూ బీసీలకు పెద్దపీట వేస్తూ అభ్యర్థులకు బి-ఫామ్స్ అందజేశామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని, బిఆర్ఎస్ ఎమ్మెల్యే అని చెప్పుకుంటూ కాంగ్రెస్ అభ్యర్థుల వెంట తిరగడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. కెసిఆర్ హయాంలో జరిగిన మెడికల్ కాలేజీ నిర్మాణం, సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సాక్షి స్టడీ మెటీరియల్ పంపిణీ



**నేటి సాక్షి జగదేవపూర్:** పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయాన్ని వీడి, ఉన్నత ఫలితాలు సాధించేందుకు సాక్షి దినపత్రిక రూపొందించిన స్టడీ మెటీరియల్ ఎంతగానో దోహదపడుతుందని ఇన్-ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు సంధ్య అన్నారు. బుధవారం జగదేవపూర్ మండలం తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సాక్షి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురాం, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల నివారణ మనందరి బాధ్యత




- **ఆత్మకూరులో అవగాహన సదస్సు క్యాన్సర్ దినోత్సవ ర్యాలీ**

**నేటి సాక్షి ఆత్మకూరు:** బాలబాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులను అరికట్టడంలో సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని నిపుణులు పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాలల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ శరత్ మరియు పుష్పానంద కుమారి మాట్లాడుతూ.. వేధింపులకు గురైన పిల్లల జీవనశైలిలో వచ్చే మార్పులను గమనించి వారిని ఆదుకోవాలని సూచించారు. ఎంపీడీఓ నాగేంద్రుడు, ఎంఈఓ అయూబ్ అహ్మద్, టిబి యూనిట్ సూపర్వైజర్ పెద్ద మస్తానయ్య మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పోలీస్ మరియు న్యాయశాఖల సమన్వయంతో వేధింపులను అరికట్టవచ్చని తెలిపారు. క్యాన్సర్ దినోత్సవం: ఇదే సందర్భంలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. "ముందస్తు పరీక్ష-క్యాన్సర్ నుండి రక్ష" అనే నినాదంతో ఎంపీడీఓ ఆఫీస్ నుండి గౌడ్ సెంటర్ వరకు విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సోషల్ వర్కర్ వెంకటరామిరెడ్డి, నర్సింగ్ ఆఫీసర్ సురేఖ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## మాల ప్రజాప్రతినిధులకు ఘనంగా ఆత్మీయ సన్మానం

**నేటి సాక్షి జన్నారంలో జన్నారం :** జన్నారం మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించిన మాల కుల సంఘ ప్రజాప్రతినిధులను బుధవారం జ్యోతి గార్డెన్‌లో మాలమహానాడు మండల శాఖ ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. మాలమహానాడు మండల అధ్యక్షులు దాముక కరుణాకర్ మాట్లాడుతూ.. మాలలంతా ఐక్యంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో నిస్వార్థంగా సేవ చేస్తూ గుర్తింపు తెచ్చుకోవాలని కోరారు. సన్మానం పొందిన వారిలో బాదం పెల్లి సర్పంచ్ సామల విజయలక్ష్మి, కిష్టాపూర్ ఉపసర్పంచ్ కోలా దేవపాల, కలమడుగు ఉపసర్పంచ్ పాత లింగన్న మరియు పలువురు వార్డు సభ్యులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు బొట్ల సంజీవ్, కోడి ఇసాక్, ప్రధాన కార్యదర్శి కండ్లే శ్రావణ్, భరత్ కుమార్, అలుగునూర్ పద్మారావు, యువజన అధ్యక్షులు శరత్ మరియు కుల సంఘ నాయకులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు



- **డీఎస్పీ మహేంద్ర**

**నేటి సాక్షి చౌడేపల్లి:** బోయకొండ క్షేత్రంలో భక్తుల పట్ల దౌర్జన్యాలకు దిగినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని మదనపల్లి డీఎస్పీ మహేంద్ర హెచ్చరించారు. బుధవారం బోయకొండ క్షేత్రం కింద మాంసపు దుకాణదారులు, ఆటో, సుమో డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే భక్తుల వల్లే బోయకొండ అభివృద్ధి చెందుతుందని, వారి పట్ల, ముఖ్యంగా మహిళల పట్ల గౌరవంగా ప్రవర్తించాలని సూచించారు. క్షేత్రం వద్ద పనిచేసే వారందరూ తమ ఆధార్ కార్డు, ఫోటో మరియు చిరునామా వివరాలను స్థానిక పోలీసులకు సమర్పించాలని ఆదేశించారు. పనిచేసే వారి వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు రూరల్ సీఐ సాయి ప్రసాద్, ఎస్సై నాగేశ్వరరావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్ నమోదును వేగవంతం చేయాలి

- **అదనపు కలెక్టర్**



**నేటి సాక్షి మేడ్చల్ జిల్లా:** జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు (SC) చెందిన 9, 10వ తరగతి విద్యార్థుల ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ సంక్షేమ శాఖ, విద్యాశాఖ అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలను తక్షణమే జారీ చేయాలని తహసీల్దార్లకు సూచించారు. ఈ విషయంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి, జాప్యం జరగకుండా పర్యవేక్షించాలన్నారు. 10 ఏళ్లు నిండిన ప్రతి విద్యార్థికి పోస్టాఫీసు లేదా బ్యాంకులో ఖాతా ఉండాలని, కేవలం రూ. 100తో పోస్టల్ అకౌంట్ ఓపెన్ చేసేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2.5 లక్షల లోపు ఉన్న ఎస్సీ విద్యార్థులందరూ ఈ స్కాలర్‌షిప్‌కు అర్హులని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్ కుమార్ వివరించారు. దరఖాస్తు విధానం: అర్హులైన విద్యార్థులు ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, బోనఫైడ్ మరియు బ్యాంక్ వివరాలతో ఈ-పాస్ (ePass) వెబ్‌సైట్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వెబ్‌సైట్: httpswwwtgepasscgggovin ఈ సమావేశంలో డీఈఓ విజయ కుమారి, ఎల్డీఎం శివ ప్రసాద్ వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఆర్టీసీ బస్సు ఆపాలి



**నేటి సాక్షి మంచిర్యాల జిల్లా:** జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు ఆర్టీసీ బస్సు ఆపాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం PDSU ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్టీసీ డిపో కార్యాలయంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ాణాఖ జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్ మాట్లాడుతూ.. జైపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ యొక్క కాలేజీలో 50మంది అమ్మాయిలు కూడా చదువుకుంటున్నారు. కానీ కళాశాల ముందు ఆర్టీసీ బస్సు ఆపకపోవడంతో అమ్మాయిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున అమ్మాయిల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కళాశాల ముందు బస్సు ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని PDSU విద్యార్థి సంఘంగా కోరడం జరిగిందన్నారు. దీనిపై స్పందించిన ఆర్టీసీ అసిస్టెంట్ డిపో మేనేజర్ శ్రీలత ఆర్టీసీ వారికి కళాశాల విద్యార్థుల యొక్క సమస్యను తెలియజేయడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో PDSU జిల్లా కోశాధికారి జి. సౌమ్య, అంజలి, అను తదితరులు పాల్గొన్నారు.